

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 21-04-2026 సంపుటి : 07 సంచిక 321 పేజీలు : 8 వెల : రూ 3-00


# ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్ల ఏర్పాటు: సీఎం చంద్రబాబు





విజయవాడ, ఏప్రిల్ 20: ప్రతి ఒక్కరి కడుపు నిండాలని.. ఎవరూ ఆకలిలో ఉండకూడదనేదే అన్న క్యాంటీన్ల ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అన్న ఎన్టీఆర్.. తిరుమలలో ప్రారంభించిన అన్నప్రసాదం కార్యక్రమం స్ఫూర్తితో ఈ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం విజయవాడ పటమటలో అన్న క్యాంటీన్‌ను సీఎం చంద్రబాబు దంపతులు ప్రారంభించారు.అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేద వారికి కేవలం దానం చేసినట్లుగా కాకుండా, వారు గౌరవ ప్రదమైన వాతావరణంలో.. శుభ్రమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని పొందేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రత్యేకత అని చెప్పారు. ?ఇక్కడ ప్రత్యేకమైన క్యాంపస్, కాంపౌండ్ వాల్, పరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. కేవలం రూ.5లకే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా భోజనం అందిస్తున్నారని వివరించారు.ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, రోడ్లు ఊడ్చేవారు, ఇతర సామాన్య ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ఆశాబావం వ్యక్తం చేశారు. ఇస్కాన్ ఫౌండేషన్ వారు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా చాలా రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇటీవల 62 కొత్త క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. త్వరలోనే మరో 5 క్యాంటీన్లు ప్రారంభించి.. వాటి సంఖ్యను 274 కు చేర్చనున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో రూ.76 లక్షల వ్యయంతో మూడు పూటలా ఉచిత భోజనం అందించేందుకు ముందుకు వచ్చిన తన సతీమణి నారా భువనేశ్వరిని ఈ సందర్భంగా చంద్రబాబు అభినందనలతో ముంచెత్తారు.ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా.. ఒక పూట భోజనం లేదా ఒక రోజు క్యాంటీన్ ఖర్చును భరించడం ద్వారా ఈ అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ఇది కేవలం ప్రభుత్వం చేసే పని మాత్రమే కాకుండా, ప్రజలందరూ ఒక స్ఫూర్తితో కలిసి రావాల్సిన వేదిక ఇది అని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునే కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాల్సి ఉందన్నారు.ఇది కేవలం ఒక పూట ఆహారం అందించడంతో ముగిసిపోయేది కాకూడదని.. ?ప్రజల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. వారిని మనతో సమానంగా అన్ని రంగాల్లో పైకి తీసుకురావాల్సి ఉందని చెప్పారు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలను తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే నిజమైన ప్రజాస్వామ్యం, సమాజానికి స్ఫూర్తి కూడా అని తెలిపారు.

# ఏపీ వ్యాప్తంగా ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు



అమరావతి, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సంబరాలు చేసుకుంటున్నారు. కేక్ కటింగ్, అన్నదానం, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కూడా సీఎంకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీడీపీ శ్రేణులు వివిధ సేవా కార్యక్రమాలు, సంబరాలతో చంద్రబాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, వర్ల రామయ్య, టీడీ జనార్ధన్ కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం పుట్టినరోజు వేడుకల్లో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు 76 కేజీల కేక్ కట్ చేశారు. సీఎం చంద్రబాబుకు బర్త్డే విషెస్ తెలియజేస్తూ రెండు ప్రత్యేక పాటలను ఆవిష్కరించారు.అనంతపురం: చంద్రబాబు జన్మదినం సందర్భంగా అనంతపురంలో సంబరాలు అంబరాన్నంటాయి. టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ షరీఫ్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్.. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. సీఎం పుట్టిన రోజు సందర్భంగా కళ్యాణదుర్గంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు.. రక్త దానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. మెగా రక్తదాన శిబిరానికి వేలాదిగా టీడీపీ అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇప్పటికే ఐదు వేల మందికి పైగా రక్తదానం చేశారు. మెగా రక్తదాన శిబిరంలో ఎన్టీఆర్ ట్రస్ట్, రెడ్ క్రాస్‌తో పాటు పలు జిల్లాలకు చెందిన స్వచ్ఛంద రక్తదాన సంస్థలు పాల్గొన్నాయి.నెల్లూరు: ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ ప్రాంతంలో ఆనం భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి కూటమి పార్టీల నేతలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ఆనం కుటుంబసభ్యులు మహాయజ్ఞం నిర్వహించారు. పది వేల మంది మహిళలకు చీరలు, కుట్టు మిషన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.శ్రీ సత్య సాయి జిల్లా: కదిరిలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కదిరిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో జీవించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నేతలు ఆలయంలో కొబ్బరికాయలు కొట్టారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం, అరాచకం నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నేత ముఖ్యమంత్రి చంద్రబాబు అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. భారతదేశ రాజకీయాలు చంద్రబాబు చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉందన్నారు. తెలుగుజాతి రాజకీయాలలో చంద్రబాబు ఒక చరిత్ర అని చెప్పుకొచ్చారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకాంక్షించారు.చిత్తూరు: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో సీబీఎన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుప్పం ప్రజల దాహార్తి తీర్చిన అపర భగీరథుడు చంద్రబాబు చిత్ర పటానికి మూడువందల బిందెల కృష్ణా జలాలతో మహిళలు అభిషేకం చేశారు. వంద ట్రాక్టర్లతో సీఎం చిత్రాలతో పల్లకీలతో ఊరేగింపు, భారీ బైక్, ఈ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు పేరుమీద నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్విమ్స్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. సుమారు వెయ్యిమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నాలుగు మండలాల్లో పేదలకు అన్న క్యాంటీన్ల ద్వారా ఉచిత భోజనం పంపిణీ చేశారు.

పగో: పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నదానం, రక్తదాన శిబిరాలు, వృద్ధులు, వికలాంగులకు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. తణుకులో సీఎం జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఘనంగా నిర్వహించారు. మహిళలు చే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే. వ్యాపార ఉపాధి కల్పన కోసం 15 మందికి తోపుడు బండ్లు, 8 మందికి ఎగ్ కార్ట్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

చిత్తూరు: చంద్రబాబు జన్మదినం సందర్భంగా కాణిపాకం పుణ్యక్షేత్రంలో చైర్మన్ మణి నాయుడు, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబుకు నిండు నూరేళ్ల జీవితాన్ని... ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని టీడీపీ నేతలు ప్రార్థించారు.

విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు, 44వ వార్డు ఇన్‌ఛార్జ్ కోయిలాడ వెంకటేశ్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలో 500 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

కాకినాడ: జిల్లా టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు వైభవంగా నిర్వహించారు.

# దక్షిణ కొరియాతో బంధాలు మరింత బలోపేతానికి చర్యలు: మోడీ



న్యూఢిల్లీ: భారత్-దక్షిణ కొరియా మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ పాల్గొన్నారు. మోడీ, లీ జే మ్యూంగ్ సమక్షంలో ఇరు దేశాల విదేశాంగ మంత్రులు జై శంకర్, చోహ్యూన్‌లు ఎంవోయులు మార్చుకున్నారు. ఆ తర్వాత లీ జే మ్యూంగ్‌తో కలిసి ప్రధాని మోడీ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. చిప్స్ నుంచి షిప్స్, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు దక్షిణ కొరియాతో భాగస్వామ్యం ఉంటుందని మోడీ అన్నారు. దక్షిణ కొరియాతో బంధాలు మరింత బలోపేతానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రపంచ సంక్షోభ పరిస్థితుల వేళ ఇరు దేశాలు శాంతి, స్థిరత్వ సందేశం ఇస్తున్నాయని తెలిపారు. భారత్-కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరిందని.. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక ప్రవాహాల కోసం ఫైనాన్షియల్ ఫోరం ప్రారంభించామని మోడీ తెలిపారు. వ్యాపాచర సహకారానికి ఊతం ఇచ్చేందుకు పారిశ్రామిక సహకార కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు.

# జగన్‌వి క్రిమినల్ రాజకీయాలు.. మంత్రి నిమ్మల ధ్వజం

అమరావతి, ఏప్రిల్ 20 ): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాము తన గుడ్లను తానే తిన్నట్లుగా జగన్ వ్యవహారం ఉందని విమర్శించారు. తన ధనదాహం, అధికారదాహానికి



ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. అమరావతి వేదికగా మీడియాతో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు.పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్థాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు.




# ఇవేమి ఎండలు రా బాబు




విజయవాడ, ఏప్రిల్ 20 వేసవి ఎండలు మండిపోతున్నాయి. సాధారణంకన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక అర్బన్ హీట్ ఐలాండ్ తో నగరాలు నిప్పులు కొలిమిలా మారుతున్నాయి. ఎండలకు తోడుగా కాలుష్యం, కాంక్రీట్ జంగిల్స్ విడుదల చేస్తున్న కర్బన ఉద్గారాలతో నగరాల్లో రెండు మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. పగటిపూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఈ పరిస్థితులు అధిగమించి ప్రజలు సాధారణ జీవనం సాగించడానికి ఏపీ ప్రభుత్వం స్మార్ట్ ఆలోచన చేసింది. ఈ వేసవి ఆరంభం నుంచి రాష్ట్రంలో ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నంలో మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లతో వాతావరణాన్ని చల్లబరిచే ప్రయోగం చేస్తున్నాయి. గత నెల రోజులుగా విజయవాడ, విశాఖపట్నంలో ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారులలో మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లు దర్శనమిస్తున్నాయి. వీటి ద్వారా నగరాల్లోని బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్లు మరియు రద్దీగా ఉండే వీధుల్లో ఉష్ణోగ్రతను తగ్గించడానికి ఈ యంత్రాలను వాడుతున్నారు. ఇవి నీటిని చాలా సూక్ష్మమైన తుంపర్ల రూపంలో గాలిలోకి విడుదల చేస్తాయి. ఈ తుంపర్లు గాలిలోని వేడిని గ్రహించి ఆవిరైపోవడం ద్వారా చుట్టుపక్కల వాతావరణాన్ని తక్షణమే చల్లబరుస్తాయి. దీనివల్ల బాటసారులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎండ వేడి మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు తగ్గుతోందని ప్రభుత్వం చెబుతోంది.మహిమ అద్భుతం ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తున్న ఈ స్మార్ట్ టెక్నాలజీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రధానంగా 'ఆంధ్రా ఓవెన్'గా చెప్పే విజయవాడలో బాటసారులు కొత్త అనుభూతిని పొందుతున్నారని అంటున్నారు.

విజయవాడలో వేసవి ఉష్ణోగ్రతలు సుమారు 44 డిగ్రీల సెల్సియస్ గా ఉంటాయి. కొన్నిసార్లు ఇవి మరో నాలుగు లేదా ఐదు డిగ్రీలు పెరుగుతుంటాయని నివేదికలు చెబుతున్నాయి. మే నెలలో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. దీంతో విజయవాడలో ఎండ తీవ్రత తగ్గించడానికి ప్రభుత్వం మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లు అందుబాటులోకి తీసుకువచ్చిందని చెబుతున్నారు. మిస్ట్ స్ప్రేయింగ్ మెషీన్లు వెదజల్లే నీళ్లు రోడ్ల చుట్టుపక్కల వాతావరణాన్ని చల్లబరుస్తున్నాయి. వీటివల్ల రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలు కూడా ఎండిపోకుండా పచ్చదనం పెరుగుతుందని అంటున్నారు. మరోవైపు ఈ ప్రక్రియ వల్ల కాలుష్యం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ విధానం సత్ఫలితాలను ఇస్తే భవిష్యత్తులో తిరుపతి, రాజమండ్రి వంటి నగరాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని చెబుతున్నారు. ఇక సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉష్ణోగ్రతలను నిలువరించేందుకు కేంద్రీకృత వ్యవస్థ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఇవి రాబోయే రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడిమి ఉంటుందన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు.ఏపీఎస్‌డీఎంఏ ప్రకారం.. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు నుండి మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోంది. దీని ఫలితంగా మన్యం, అల్లూరి, పోలవరం, ఏలూరు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో 45 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 244 మండలాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కూడా కురిశాయి. ఆదివారం పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లోని 27 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు ఉండే అవకాశం ఉంది.విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 25 మండలాల్లో కూడా వేడిగాలులు వీచే అవకాశం ఉంది. నమోదైన ఇతర గరిష్ట ఉష్ణోగ్రతలలో కర్నూలు జిల్లాలోని గూడూరులో 44.3 డిగ్రీలు, అనంతపురంలోని తేరన్నపల్లిలో 44.1 డిగ్రీలు, తిరుపతి జిల్లాలోని వరదయ్యపాలెంలో 43.5 డిగ్రీలు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ 25 వరకు వడగాలులతో కూడిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలోని అక్కడక్కడా ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమలోని అక్కడక్కడా వడగాలులు కొనసాగే అవకాశం ఉండగా, కోస్తా ఆంధ్రప్రదేశ్ మరియు యానాంలోని అక్కడక్కడా వేడి, తేమతో కూడిన వాతావరణం నెలకొనే అవకాశం ఉంది.ఈ వాతావరణ పరిస్థితులు ఏప్రిల్ 25 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్ తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ అంచనా వేశారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడి కొనసాగగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# అరటికి ఏమైంది

రాజమండ్రి, ఏప్రిల్ 20 పశ్చిమ ఆసియాలో ఎగుమతులపై నెలకొన్న ఉద్రిక్తతలు, మధ్యవర్తుల జోక్యం, ఏకకాలంలో పంట కోత, అస్తవ్యస్త వాతావరణ పరిస్థితులు వంటి ప్రపంచ, స్థానిక కారణాలతో అరటి రైతులు నష్టపోతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో టన్నుకు రూ. 18,000 నుంచి రూ. 27,000 మధ్య ధరలు పలికినప్పటికీ.. ఎగుమతి డిమాండ్ తగ్గడంతో మార్చి నుంచి ధరలు తీవ్రంగా పడిపోయాయి.ఒక దశలో, ధరలు టన్నుకు రూ. 6,000-రూ. 9,000 కు పడిపోయాయి. తర్వాత ధరలు సుమారు రూ. 10,000 - రూ. 11,000 వరకు స్వల్పంగా కోలుకున్నప్పటికీ రైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది. అరటి సాగులో పులివెందుల ప్రాంతం ఎక్కువ వాటాను కలిగి ఉంది. దాదాపు 25,000 ఎకరాలలో విస్తరించి ఉంది. ఇతర ప్రాంతాలలో 8 నుండి 10 రోజులతో పోలిస్తే.. ఈ ప్రాంతపు అరటిపండ్లు వాటి నాణ్యతకు పెట్టింది పేరు. 12 నుండి 14 రోజుల పాటు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.ఇక్కడ నుంచి సగటున ప్రతిరోజూ 1,000 టన్నులకు పైగా అరటిపండ్లు ఢిల్లీ, కోల్‌కతా, శ్రీనగర్ వంటి నగరాలకు, అలాగే హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు రవాణా అవుతున్నాయి. అరబ్ దేశాలకు కూడా ఎగుమతులు జరుగుతాయి. ప్రతిరోజూ 10 నుండి 16 ట్రక్కుల లోడ్లు వెళ్తాయి. ప్రతి ట్రక్కు 20 నుండి 25 టన్నుల సరుకును తీసుకువెళుతుంది. ఇది ముంబై ఓడరేవులకు చేరడానికి ముందు అనంతపురం జిల్లాలోని తాడిపత్రి రైల్వే స్టేషన్ మీదుగా వెళుతుంది.ఉత్పత్తి బాగా ఉన్నా.. అధిక రవాణా ఖర్చులు లాభాలను తగ్గిస్తున్నాయి. రైతులు 20 టన్నుల రవాణాకు రూ. 80,000 నుండి రూ. 1.1 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. అంటే కిలోకు రూ. 6-8 చొప్పున ఖర్చవుతోంది. దీనితో పోలిస్తే, మహారాష్ట్ర రైతులకు కిలోకు కేవలం రూ. 2-3 మాత్రమే ఖర్చవుతోంది. మహారాష్ట్ర నుండి ముందుగానే అరటి రావడం కడప ఉత్పత్తులకు డిమాండ్‌ను మరింత బలహీనపరిచింది.కొనుగోలుదారులు లేకపోవడం వల్ల పెద్ద మొత్తంలో పంట అమ్ముడుపోకుండా పొలాల్లోనే కుళ్లిపోతోందని రైతులు అంటున్నారు. ఎకరానికి సాగు ఖర్చులు రూ. 1.5 లక్షలకు చేరుకుంటుండగా, 15-20 టన్నుల దిగుబడిని ఆశిస్తున్న తరుణంలో ప్రస్తుత ధరలతో నష్టాలో ఉన్నాయని రైతులు వాపోతున్నారు.ఎగుమతులకు అంతరాయం కలగడం, మహారాష్ట్రలో ఉత్పత్తి పెరగడం అనే రెండు కారణాల వల్ల ధరలు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. డిమాండ్ పెరగడంతో ధరలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, రైతులు మాత్రం ఇంకా అనుమానంగానే ఉన్నారు. ధరలను తగ్గించడానికి మధ్యవర్తులు అంతర్జాతీయ అంశాలను సాకుగా చూపుతున్నట్టుగా చెబుతున్నారు.

# స్లీపర్ బస్సుల నిషేధం

## ప్రభుత్వానికి నివేదిక




విజయవాడ, ఏప్రిల్ 20 ప్రైవేటు స్లీపర్ బస్సులు వరుసగా తీవ్ర ప్రమాదాలకు గురవుతున్న విషయం తెలిసిందే. నేపథ్యంలో ఈ ప్రమాదాల వెనుక గల కారణాలపై విచారణ జరపాలని, ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి అవసరమైన చర్యలపై సిఫార్సులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు.. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సమగ్ర దర్యాప్తు జరిపి, స్లీపర్ బస్సులను దశలవారీగా పూర్తిగా నిషేధించాలని సిఫార్సు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది.రాష్ట్రంలో స్లీపర్ బస్సులపై నిషేధం విధించే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇప్పటికే రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా పేర్కొన్నారు.నివేదిక ప్రకారం.. వరుస ఘోర ప్రమాదాల నేపథ్యంలో స్లీపర్ బస్సులపై దశలవారీ నిషేధాన్ని విధించాలని ఏఎస్‌సీఐ సిఫార్సు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన ఈ నివేదిక, తీవ్రమైన భద్రతాపరమైన ఆందోళనలను ఎత్తి చూపుతోంది. 22 నెలల్లోగా స్లీపర్ బస్సు సర్వీసులను పూర్తిగా తొలగించాలని పిలుపునిచ్చింది.ఈ అధ్యయనం అంతర్జాతీయ పద్ధతులతో పోలికలు చేసింది. చైనా 2012లో స్లీపర్ బస్సులను నిషేధించగా, అనేక ఐరోపా దేశాలు వాటిలో అంతర్లీనంగా ఉన్న భద్రతా ప్రమాదాల కారణంగా 2004లోనే ఇలాంటి నిషేధాలను అమలు చేశాయని పేర్కొంది.ఏఎస్‌సీఐ పరిశోధనలు స్లీపర్ బస్సులలోని కీలకమైన డిజైన్ లోపాలను స్పష్టం చేస్తున్నాయి. వాటిలో కింద, పైన బెర్త్‌లు ఉండటం కూడా సరిగా లేదని స్పష్టం చేసింది. బస్సు బోల్తా పడే ప్రమాదం పెరగడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా ప్రయాణికులను ఖాళీ చేయించడానికి ఇబ్బంది అవుతుంది.

స్లీపర్ బస్సులో ఉన్న బెర్త్‌ల మధ్య ఒకరే ఇబ్బందిగా నడవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగితే.. వెంట వెంటనే అందరూ బయటకు రాలేకపోతున్నారు. గందరగోళం నెలకొని మృతుల సంఖ్య మరింత పెరుగుతోంది.కర్నూలు జిల్లా చిన్నటేకూరు నాయకల్లు ఫ్లైఓవర్ సమీపంలో ప్రమాదంపై జరిపిన దర్యాప్తులో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయి. ప్రమాదానికి గురైన బస్సును మోటార్ వెహికల్స్ చట్టం కింద అనుమతి లేకుండా, 53 సీట్ల బస్సు నుండి 43 బెర్త్‌ల స్లీపర్‌గా అక్రమంగా మార్చారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలను మూసేశారు. డ్రైవర్ డోర్‌కు శాశ్వతంగా బోల్టు వేశారు. లోపల అగ్ని నిరోధకత లేని పదార్థాలను ఉపయోగించారు. ఆ వాహనంలో ఎల్‌పీజీ సిలిండర్, లిథియం-అయాన్ బ్యాటరీలతో సహా ప్రమాదకరమైన వస్తువులు ఉన్నట్లు కూడా దర్యాప్తు అధికారులు కనుగొన్నారని నివేదిక పేర్కొంది.చట్టవిరుద్ధమైన మార్పులు చేసినప్పటికీ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేయడం, వాహన్ డేటాబేస్‌లోని రిజిస్ట్రేషన్ రికార్డులలో వ్యత్యాసాలు ఉండటం వంటి అమలు వైఫల్యాలను కూడా ఈ నివేదిక బయటపెట్టింది. ఒడిశాలో రిజిస్టర్ అయిన ఆ బస్సు, పర్మిట్ నిబంధనలను దుర్వినియోగం చేస్తూ, సరిగా లేకుండా అంతర్రాష్ట్ర మార్గాల్లో నడుస్తోంది.మరోవైపు రెట్రోఫిట్ వర్క్‌షాప్‌లు సరైన పర్యవేక్షణ లేకుండా పనిచేస్తున్నాయని కూడా నివేదిక పేర్కొందినాలుగు దశల ప్రతిపాదనలుమొదటి దశ ప్రకారం స్లీపర్ బస్సుల తయారీ, మార్పిడిని తక్షణమే నిలిపివేయాలి.రెండో దశలో ప్రస్తుతం ఉన్న స్లీపర్ బస్సుల స్థానంలో 18-24 నెలల వ్యవధిలో సురక్షితమైన సీటర్ బస్సులను క్రమంగా ప్రవేశపెట్టాలి.మూడో దశ హై-స్పీడ్ రైలు కారిడార్లు, తక్కువ ఖర్చుతో కూడిన విమానయానంతో సహా ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థలను విస్తరించడంపై దృష్టి పెట్టాలి.చివరి దశ ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్, అంతర్-రాష్ట్ర సమన్వయం, ఉల్లంఘనలకు రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు భారీ జరిమానాల విధించాలి.

# రాజ్యసభకు యనమల

కాకినాడ, ఏప్రిల్ 20 టీడీపీలో సీనియర్ లీడర్ గా యనమల రామక్రిష్ణుడు ఉన్నారు. ఆయన 1983 నుంచి గెలుస్తూ వచ్చారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టాక టికెట్ అందుకుని ఎమ్మెల్యేగా తొలిసారి చట్టసభలలో అడుగుపెట్టిన యువ నేతలలో యనమల రామక్రిష్ణుడు ఒకరు. ఆయన ఏకంగా ఆరు సార్లు తుని నుంచి గెలిచారు. రెండు సార్లు ఎమ్మెల్సీగా పన్నెండేళ్ళ పాటు ఉన్నారు. సుదీర్ఘ కాలం మంత్రిగా ఆర్థిక మంత్రిత్వ శాఖను చూశారు. ఇక యనమల కోరిక ఒకటి మాత్రం ఇంతటి సుదీర్ఘ రాజకీయ జీవితంలో తీరలేదు అదే రాజ్యసభ సభ్యత్వం. ఆయన ఎంపీగా నెగ్గి పార్లమెంట్ లో తన గళం వినిపించాలని అనుకుంటున్నారు. ఆ కోరిక కూడా 2014 నాటిది. కానీ ఆయన సేవలు రాష్ట్రానికి అవసరం అని చెబుతూ పార్టీ ఎమ్మెల్సీగానే చాన్స్ ఇస్తూ పోయింది.ఇదిలా ఉంటే టీడీపీలో యనమలకు పూర్వపు ప్రాధాన్యత లేదని ఆయన పూర్తిగా రాజకీయాల నుంచి రిటైర్ కావాల్సిందే అన్న ప్రచారం సాగింది. కానీ అవన్నీ ఒట్టి మాటలే అని తేలిపోయింది. యనమలను టీడీపీ పొలిట్ బ్యూరోలో కొనసాగించారు తాజాగా విడుదల చేసిన జాబితా చూస్తే కనుక అందులో అనేక మంది సీనియర్ నేతల పేర్లు లేకుండా పోయాయి. కానీ యనమలకు మాత్రం కీలక స్థానం అలాగే ఉంచేశారు. దాంతో టీడీపీలో యనమల సీనియారిటీకి తగిన గౌరవం దక్కుతోందని ఆయన వర్గం ఆనందంగా ఉంది.ఇక యనమల విషయంలో టీడీపీ అధినాయకత్వం ఎంతో గౌరవ పూర్వకంగా వ్యవహరిస్తూ వస్తోంది. దాంతో యనమలకు పార్టీ పదవులతో పాటుగా రాజ్యసభ సభ్యత్వం కూడా దక్కుతుందా అన్న చర్చ మొదలైంది. ఏపీ నుంచి జూన్ లో ఖాళీ అయ్యే నాలుగు సీట్లలో టీడీపీకి రెండు దక్కుతాయి. అందులో ఒకటి సానా సతీష్ కి ఇస్తారు అన్నది అంతా అనుకుంటున్నదే. అయితే ఆ రెండవ సీటు యనమలకే రిజర్వ్ చేశారా అన్న చర్చ సాగుతోంది.అయితే ఇదే సీటు విషయంలో ఎంతో మంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. కానీ బీసీ సామాజిక వర్గంలో పెద్ద దిక్కుగా బాబుతో సమానంగా సీనియర్ గా ఆయన సమకాలీనుడిగా ఉన్న యనమలకు ఈ సీటు ఇస్తే పార్టీలో ఎవరూ పోటీ పడరని ఆలోచిస్తున్నారు. అంతే కాదు యనమల సేవలను జాతీయ స్థాయిలో కూడా వినియోగించుకోవాలని టీడీపీ చూస్తోంది అని అంటున్నారు. యనమల పొలిట్ బ్యూరోలో కొనసాగడం వెనక కూడా పార్టీ పెద్దల ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. రేపటి రోజున లోకేష్ పార్టీని లీడ్ చేసినా యనమల వంటి వారు తమ అనుభవంతో తగిన సూచనలు సలహాలు ఇచ్చే విధంగా ఉంటుందనే ఇలా చేశారు అని అంటున్నారు. అదే విధంగా రాజ్యసభలో కూడా సీనియర్ నేతల అవసరం ఉందని అది యనమలతో భర్తీ చేస్తారు అని అంటున్నారు. మొత్తానికి యనమలకు పొలిట్ బ్యూరో నుంచి నేరుగా ఢిల్లీలో పార్లమెంట్ కి దారులు తెరిచారు అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో.



## నియోజకవర్గాలు పెరుగుతాయా...

ఒంగోలు, ఏప్రిల్ 20 ఆంధ్రప్రదేశ్ లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం ఈ సారి అయినా నెరవేరుస్తుందా? 2029 ఎన్నికల నాటికి ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెరుగుదల పై అనుమానాలు కలుగుతున్నాయి. ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు నియోజకవర్గాల సంఖ్య పెంచాల్సి ఉంది. అయితే రాష్ట్ర విభజన జరిగి పదేళ్లకు పైగానే గడిచినా, మూడు ఎన్నికలు ముగిసినా ఇంత వరకూ నియోజకవర్గాలను పెంచలేదు. మరొకవైపు పార్లమెంటులో డీ లిమిటేషన్ బిల్లు వీగిపోవడంతో దీనిపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. మూడు పార్టీల కూటమిగా ఉండటం, ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో నియోజకవర్గాల సంఖ్య పెరిగితే తాము పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి టిక్కెట్లు కేటాయించే వీలుంటుంది. ఏపీలో శాసనసభ స్థానాలు 225కి, తెలంగాణలో 134కి పెరగాల్సి ఉంది. అయితే తాజాగా డీ లిమిటేషన్ బిల్లు వీగిపోవడంతో ఏపీ, తెలంగాణలోనూ సీట్ల సంఖ్య 2029 ఎన్నికల నాటికి పెరుగుతాయా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణాలు కూడా లేకపోలేదు.ఎందుకంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దేశం మొత్తంలో నియోజకవర్గాల సంఖ్య పెంచితే ఓకే. కానీ ఏపీ, తెలంగాణలలో మాత్రమే పెంచాలంటే కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా ఆలోచిస్తుందన్న టాక్ ఏపీ రాజకీయ నేతలను భయపెడుతుంది. జనగణన పూర్తయిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరుగుతాయన్న ఆశ ఉన్నప్పటికీ తెలంగాణలో నియోజకవర్గాలు పెంచితే కాంగ్రెస్ ప్రయోజనం పొందుతుందని భావించి మళ్లీ వాయిదా పడుతుందేమోనన్న అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. కానీ దేశంలో జరిగే డీ లిమిటేషన్ కు, ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పెంపునకు సంబంధం లేదని ఎవరికి వారే సర్ది చెప్పుకుంటున్నా ఏదో తెలియని భయం మాత్రం ఏపీ నేతలను వెంటాడుతుంది.

# తిరువూరు, సత్యవేడు...

## రిజర్వుడు నియోజకవర్గాల్లో అంత....

తిరుపతి ఏప్రిల్ 20 తెలుగుదేశం పార్టీ షెడ్యూల్ కులాల నియోజకవర్గాల నేతల్లో అసంతృప్తి నెలకొంది. అనేక నియోజకవర్గాల్లో నేతలు టీడీపీలో తాము లాభం పొందలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. తిరువూరుతో పాటు తాజాగా సత్యవేడు నియోజకవర్గం నేతలు కూడా బాహాటంగా బయటపడటం ఒకింత పార్టీకి ఇబ్బందికరంగా మారింది. నేతలను కట్టడి చేయాల్సిన నాయకత్వం అక్కడ మరొకరిని ఇన్ ఛార్జిగా పెట్టి ప్రోత్సహిస్తుండటం, వారే నియోజకవర్గంపై పెత్తనం చేస్తుండటంతో నేతలు తిరగబడుతున్నారు.తిరువూరు నియోజకవర్గంలో ఏదైతే జరిగిందో సత్యవేడులోనూ అదే జరిగింది. తిరువూరులో కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అక్కడ పెత్తనమంతా ఎంపీ కేశినేని చిన్నిదంటూ ఆయనే నేరుగా ఆరోపణలు చేశారు. మద్యం, ఇసుక వంటి దందాలను సాగిస్తున్నారని అన్నారు. తాను టిక్కెట్ కోసం యాభై కోట్లు ఇచ్చానని కొలికిపూడి గతంలో ఆరోపించారు. తాజాగా సత్యవేడు నియోజకవర్గంలో ఆదిమూలం కుమారుడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమకు వంద కోట్లు ఇస్తే నియోజకవర్గం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని ప్రకటించారు.నిజంగా మొన్నటి ఎన్నికల్లో వంద కోట్ల రూపాయలు ఆదిమూలం ఖర్చు చేశారా? ఎన్నికల కోసమే ఖర్చు పెట్టారా? మరెవరికైనా నిధులు ఇచ్చారా? అని సోషల్ మీడియాలో ట్రోల్ అవుతుంది. ఒక్క సత్యవేడు నియోజవర్గం ఆదిమూలం వంద కోట్లు ఖర్చు పెట్టారంటే మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో తాము అప్పులు తెచ్చి మరీ ఈ వంద కోట్లు ఖర్చు పెట్టామని, ఇప్పుడు తమను పక్కన పెట్టి ఇన్ ఛార్జి ఇసుక, మద్యం దందాలను నిర్వహిస్తున్నారని, తమ పరిస్థితి ఏంటన్న ఆయన ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకడం లేదు. మొత్తం మీద సత్యవేడు నియోజకవర్గంలో వంద కోట్లు వ్యయం చేశారన్న ఆదిమూలం కుమారుడు వ్యాఖ్యలు పార్టీని కుదిపేస్తున్నాయి.

## అక్షయ తృతీయ సందర్భంగా శ్రీ గాయత్రీ దేవికి గంధ లేపనం..



స్థానిక పట్టణంలోని శ్రీ గాయత్రీ నగర్ లో వెలసిన వేద గాయత్రి మాత దేవాలయంలో అక్షయ తృతీయ ను పురస్కరించుకొని గాయత్రి మాతకు ప్రాతఃకాలంలోనే గంధ లేపనము అలంకరణ వివిధ ముఖ్యమైన పూజలను నిర్వహించారు. దేవాలయ అర్చకులు బలకుంది నరహరి శాస్త్రి చే పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. సాయంకాలం ఆదిశంకరాచార్యులు రచించినటువంటి స్తోత్ర పారాయణం, కనకధారా స్తోత్రము పఠించి అమ్మవారికి మంగళహారతి నిర్వహించారు. స్తోత్ర పారాయణం నకు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పారాయణం పఠించి అమ్మవారి కృపకు పాత్రులైనారు.

## పోలీస్ ప్రజా వేదికకు 106 ఫిర్యాదులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20:నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ 106 ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని తెలిపారు. నిర్ణీత గడువులోపల ఫిర్యాదులను పరిష్కరించాలి, పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా భూమి వివాదాలు, ఆస్తి మోసాలు, రహదారి అడ్డంకుల వంటి సమస్యలపై పలు ఫిర్యాదులు నమోదు అయ్యాయి.

## రీ-ఓపెన్ దరఖాస్తులపై వేగం పెంచాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20 :-జిల్లాలో రీ-ఓపెన్ అయిన దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రీ-ఓపెన్ అయిన దరఖాస్తులపై నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి సమగ్ర నివేదికలు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో మొత్తం 5,283 దరఖాస్తులు రీ-ఓపెన్ కాగా, 4,919 పరిష్కరించబడ్డాయి. ఇంకా 364 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు.రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈ వేదికల ద్వారా 162 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో ఈ రోజు 230 అర్జీలు నమోదు అయ్యాయి.కార్యక్రమంలో డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వర జయంతి వేడుకలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20:-జిల్లా కలెక్టరేట్‌లో మహాత్మా బసవేశ్వరుల 893వ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బసవేశ్వరుల చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బసవేశ్వరుల ఆలోచనలను ఆచరణలో పెట్టి సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం విలువలను కాపాడాలని సూచించారు. 12వ శతాబ్దానికి చెందిన



మహనీయ సంస్కర్తగా బసవన్న కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రోత్సహించారని తెలిపారు.సమాజంలో న్యాయం, ధర్మం స్థాపనకు ఆయన చేసిన సేవలు విశేషమని, తన సాహిత్యం ద్వారా ప్రజల్లో ఉన్నతమైన ఆలోచనలను వ్యాప్తి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, జిల్లా టూరిజం అధికారి విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 115 ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం.

### - కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్...

విభారే న్యూస్ ఏప్రిల్ 20 కర్నూలు జిల్లా ప్రతినిధి..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 115 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.నడవలేని వృద్ధుల వద్దకు వెళ్ళి సమస్యలను ఆరా తీసిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ... 1)భూ వివాదంలో న్యాయం చేయాలని కర్నూలు, మేడం కాంపౌండ్ కు చెందిన ఏనీజెంటి రామలక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు. 2)కర్నూల్ కంట్రోల్ రూమ్ దగ్గర మున్సిపల్ హై స్కూల్ వెనకవైపు ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్లో ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించడం లేదని, ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించి ఆరవ తరగతికి ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను తీసుకోవాలని కర్నూలు సంతోష్ నగర్ చెందిన జయ సంగీత ఫిర్యాదు చేశారు. 3)భార్య తరపున బంధువుల నుండి నాకు వేధింపులు,ఇబ్బందులు చిత్రహింసలు ఉన్నాయని నాకు,నా పిల్లలకు రక్షణ కల్పించాలని పాణ్యం కు చెందిన బాలనాయక్ ఫిర్యాదు చేశారు. 4)నా కుమారునికి సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పి స్తామని చెప్పి కర్నూల్ కు చెందిన కస్తూరి సుదర్శన్ రూ. 10 లక్షల 30 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు,రంగరాజు వీధి కి చెందిన ప్రభావతి బాయి ఫిర్యాదు చేశారు. 5)ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా భూమి ని ఆక్రమించుకొని ఇల్లు కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని క్రిష్ణగిరి మండలం,ఆలంకొండ గ్రామానికి చెందిన మునెమ్మ ఫిర్యాదు చేశారు. 6)ఎమ్మిగనూరుకు చెందిన అనిల్ కృష్ణ ప్లాట్ ఇప్పిస్తానని,రూ. 5 లక్షలు అప్పు ఇస్తానని నమ్మించాడు.ముందుగానే రూ. 50 వేలు వడ్డీ తీసుకుని మోసం చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కర్నూలు వన్‌టౌన్‌కు చెందిన ఆర్. విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. 7)పంచలింగాల వద్ద బైక్ పై వెళుతుంటే వెనక నుండి వచ్చి కారు తో ఢీ కొట్టి వెళ్లిపోయాడు. ఆ రోడ్డు ప్రమాదంలో 4 సంవత్సరాల కుమారుడు మృతి చెందాడు.ఆ వాహనం ను ట్రేస్ చేసి న్యాయం చేయాలని గద్వాల జిల్లా,ఐజ మండలంకు చెందిన హరికృష్ణ ఫిర్యాదు చేశారు. 8)హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు కు చెందిన శరత్ గౌడ్ రూ. 4 లక్షల 70 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, ధనలక్ష్మి నగర్ చెందిన ఉదయ్ కుమార్ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐలు శివ శంకర్, రామక్రిష్ణ,రామయ్య నాయుడు పాల్గొన్నారు.



## నంద్యాలలో హాల్‌మార్క్ లేకుండా బంగారం విక్రయాలు.. 3 కేజీలు సీజ్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20:నంద్యాల పట్టణంలో బంగారు వ్యాపారుల అక్రమాలు బహిర్గతమయ్యాయి. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలోని ఓ ప్రముఖ బంగారు దుకాణంలో హాల్‌మార్క్ లేకుండా బంగారు ఆభరణాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ప్రత్యేక బృందం అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టింది. విజయవాడ నుంచి వచ్చిన ఈ బృందం నిర్వహించిన దాడుల్లో మహానంది జువెలర్స్‌లో సుమారు 3 కేజీల హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుంది.ఈ తనిఖీలతో నంద్యాల పట్టణం మొత్తం ఒక్కసారిగా కుదేలైంది. ముఖ్యంగా మొయిన్ బజార్ పరిధిలోని బంగారు దుకాణాలన్నీ ఒక్కసారిగా మూతపడ్డాయి. అధికారుల దాడుల సమాచారంతో పలువురు వ్యాపారులు తమ షాపులకు తాళాలు వేసి పరారయ్యారు. పట్టణంలో చాలా కాలంగా హాల్‌మార్క్ లేకుండా బంగారు నగలు విక్రయాలు సాగుతున్నట్టు ఈ ఘటన ద్వారా బయటపడింది.బిఐఎస్ అధికారులు మాట్లాడుతూ, నంద్యాలలో కొన్ని దుకాణాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇకపై ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ ఘటనతో నంద్యాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇన్నాళ్లుగా హాల్‌మార్క్ లేని నగలను కొనుగోలు చేసిన వినియోగదారులు మోసపోయినట్లయిందనే భావన వ్యక్తమవుతోంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## నంద్యాలలో చంద్రబాబు జన్మదిన వేడుకలు వైభవంగా---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు నంద్యాలలో ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 76 కేజీల భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.యువత ఉత్సాహం మధ్య రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించగా, పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలకు భారీ విందు ఏర్పాటు చేయడంతో పాటు పేదల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.చంద్రబాబు నాయుడు దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు విజన్ కలిగిన నాయకుడని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సంక్షేమం, పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మైనార్టీల అభివృద్ధికి ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## స్వీయ గణనపై దృష్టి - కలెక్టర్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20 :-జిల్లాలో స్వీయ గణన 2027 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్వీయ గణన, స్వచ్ఛ ఆంధ్ర, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, జలధార?జలహారతి అంశాలపై ఆమె దిశానిర్దేశం చేశారు. డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.స్వీయ గణనలో ప్రజలు ఆన్లైన్ ద్వారా మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, జియో కోఆర్డినేట్స్ ఆధారంగా వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలోని నీటి తొట్టెలను ప్రతిరోజూ శుభ్రపరచి నీటితో నింపాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటిస్తూ మూడు రంగుల డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పెండింగ్ వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కాలువల్లో చెత్త వేయకుండా కట్టడి చేయాలని, ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అధికారులు సమన్వయంతో పని చేసి నిర్ణీత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## ముందస్తు పన్ను వసూళ్లలో జోరు-

### రోజుకు రూ 80 లక్షలకు పైగా వసూళ్లు--

### 5 శాతం రాయితీతో పౌరుల స్పందన పెరుగుదల

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20:-నంద్యాల మున్సిపాల్టీలో ముందస్తు ఆస్తి పన్ను వసూళ్లు ఊపందుకున్నాయి. ముందుగానే పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని మున్సిపల్ అధికారులు చేపట్టిన విస్తృత ప్రచారం మంచి ఫలితాలను ఇస్తోంది. పట్టణవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన పెరగడంతో పన్ను చెల్లింపులు గణనీయంగా పెరిగాయి.మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆదేశాల మేరకు రెవిన్యూ అధికారి వెంకటరెడ్డి పర్యవేక్షణలో రెవిన్యూ ఇన్ స్పెక్టర్లు విక్రమ్ శభరిష్ తదితర సిబ్బంది ప్రతిరోజూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్ధేశించి వసూళ్లలో అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టమైన సూచనలు జారీ చేస్తున్నారు.అధికారుల క్రమమైన పర్యవేక్షణ ప్రజల్లో అవగాహన పెంపు చర్యల ఫలితంగా రోజుకు రూ 80 లక్షలకు తగ్గకుండా వసూళ్లు జరుగుతున్నాయని కమిషనర్ బి శేషన్న తెలిపారు. ముందస్తు పన్ను చెల్లించడం ద్వారా రాయితీ పొందడంతో పాటు మున్సిపల్ సేవల అభివృద్ధికి పౌరులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మరింత మెరుగైన పారిశుధ్యం మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం పన్ను వసూళ్లు కీలకమని పేర్కొంటూ అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి పన్నులు చెల్లించాలని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు.



## సుదర్శన్ క్యాన్సర్ క్లినిక్ ప్రారంభం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 20: పట్టణంలోని పద్మావతి నగర్ మెయిన్ రోడ్డులో మున్సిపల్ కార్యాలయం సమీపంలో సుదర్శన్ సర్జికల్ క్యాన్సర్ కేర్ క్లినిక్‌ను సోమవారం ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ప్రముఖ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ వై. నాగ సుదర్శన్ రెడ్డి, క్యాన్సర్ మెడికల్ స్పెషలిస్ట్ డాక్టర్ సుస్మిత ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ పట్టణంలోనే క్యాన్సర్ సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఉపయోగకరమని తెలిపారు. డాక్టర్ నాగ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా నియంత్రించవచ్చన్నారు. అవసరమైన శస్త్ర చికిత్స, రేడియేషన్, మెడికల్ థెరపీ సేవలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పేదలకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.కార్యక్రమంలో ఉదయానంద ఆసుపత్రి డైరెక్టర్లు పరమేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190